క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో వైకుంఠధామం నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు శుక్రవారం సర్పంచ్ బింగి కరుణాకర్ వినతిపత్రం ఇచ్చారు. మొదట ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.పదిలక్షలతో నిర్మిస్తే స్థానికులు అడ్డుకొని హైకోర్టుకు వెళ్లారని, కోర్టు తీర్పుకు లోబడి అదనపు వైకుంఠ ధామం నిర్మాణం కోసం జాతీయ విపత్తు నిధి ద్వారా రూ. 12.50 లక్షలు మంజూరు కాగా వాటితో పనులు ప్రారంభించామని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు మరో రూ. ఐదు లక్షల నిధులు అవసరం అవుతాయని, సత్వరం మంజూరు చేయాలన్నారు.

ఫీజుల దోపిడీని అరకట్టాలి

రామడుగు: రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీంతో సామాన్యులకు విద్య అందే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

రామడుగు: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌యాదవ్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు జన సంపర్క్ అభియాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, వీటిని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వైద రామానుజం, పొన్నం శ్రీనివాస్, నాయకులు పోచంపల్లి నరేష్, ఎడవల్లి రాజిరెడ్డి, అంజిబాబు, కుమార్, పూరెల్ల శ్రీకాంత్, రామ్, బండారి శ్రీనివాస్, లక్ష్మణ్, అశోక్, స్వామి, జయంత్ పలువురు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి

వీణవంక: సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట రెడ్డి సంఘం నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, మూల పుల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌గౌడ్, రాంచంద్రం తదితరులు ఉన్నారు.


కోరంలేక మండల సభ వాయిదా



వాయిదా వేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

ఇల్లందకుంట: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమైనప్పటికీ గంటన్నర సేపు వేచి చూసినా సరిపడా సభ్యులు రాకపోవడంతో సభను వాయిదా వేశారు. ఎంపీపీ సరిగొమ్ముల పావని, శ్రీరాములపల్లి సర్పంచ్ మొగిలి, వాగొడ్డు రామన్నపల్లి సర్పంచ్ పుట్టరాజు, మల్లివానిపల్లి సర్పంచ్ కలాల రాజిరెడ్డి మాత్ర హాజరయ్యారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది సభ్యులకు సమాచారం ఇస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చీర,నగదు అందిస్తున్న దీవెన

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భార్య సుంకె దీవెన పట్టుచీర, రూ.పదివేలు అందజేశారు. గ్రామానికి చెందిన పొన్నాల రవి,మునెమ్మ కూతురు పెళ్లికి ఇబ్బందిపడుతుండగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తవుటు మురళి, సర్పంచ్ జాడి లక్ష్మిరాజమల్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు. రజక సంఘం నాయకులు పొన్నాల అంజయ్య, పూసాల మల్లేశం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పోరండ్లలో పోచమ్మ బోనాలు



నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు, గ్రామస్తులు

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్లలో పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం పునఃప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ఇంటికో బోనంతో శివసత్తులు పూనకాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరంతా చల్లగా ఉండాలని, పాడి పంటలు బాగుండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. అర్చకులు శేశాచారి, శ్రీధరచారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.లక్ష విరాళం

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి గ్రామంలో జూన్ 3, 4, 5న భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు జరుగనున్న నేపథ్యంలో వీణవంక గ్రామానికి చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి తనవంతుగా గ్రామస్తులకు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈమేరకు తన అనుచరుల ద్వారా నగదు అందించారు. ఈసందర్భంగా ఉదయానందన్‌రెడ్డి బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలకు రూ.లక్ష విరాళంగా ఇవ్వడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాతలక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ సమ్మిరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, మర్రి రవి, సమిండ్ల చిట్టి, దాసారపు లోకేశ్, ఎల్లారెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, రాజశేఖర్, చిన్నాల శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కార్మికులను సంఘంలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీయూసీసీ జాతీయ నాయకుడు కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, బండారి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో పనిచేసే కార్మికులు టీయూసీసీ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, కార్మికుల పొట్టగొడుతున్న ప్రభుత్వం కాంట్రాక్టర్లను బతికిస్తుందని ఆరోపించారు. కార్మికులకు నెలకు రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11వేలు ఇచ్చి మిగతా డబ్బులు కాంట్రాక్టర్ కాజేస్తున్నాడని విమర్శించారు. పీఎఫ్ డబ్బులు పూర్తిస్థాయిలో వేయడం లేదని, ఈఎస్ఐ సౌకర్యం కూడా సక్రమంగా అమలుకావడం లేదన్నారు. కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాడే ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్(టీయూసీసీ)లో కార్మికులు చేరడం పట్ల అభినందించారు. కార్మికుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్ కుమార్, బద్రీ, నేత కార్మికులు పాల్గొన్నారు.

మునగసాగు సందర్శన



మునగసాగును సందర్శిస్తున్న శ్రీరామ్

గన్నేరువరం: మండలంలో మునగసాగును శుక్రవారం నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీరామ్ సందర్శించారు. నాబార్డ్ సౌజన్యం, బాలవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాసీంపేట, మైలారం, గోపాల్‌పూర్‌లో రైతులు సాగు చేస్తున్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అంతరపంటగా బంతి, టమాట సాగుతో రైతులు లాభాలు పొందుతున్నట్లు వివరించారు. మైలారంలో మునగ పొడి, ట్యాబ్లెట్ల తయారీకి 35 శాతం సబ్సిడీతో త్వరలో ఫ్యాక్టరీ నెలకొల్పనున్నామని, సాంకేతిక సహకారంతో ఉత్పత్తులు తయారీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, ఆంజనేయులు, ఆదర్శరైతులు రమణారెడ్డి, రజనీ దంపతులు, జనవికాస ప్రతినిధి రాజు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ముత్తారం రైతుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

శంకరపట్నం: రెండు రోజులుగా రైస్‌మిల్ యజమాని ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదని తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు ముత్తారం రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని తాడికల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ముత్తారంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ధాన్యం తూకం వేసి కేశవపట్నంలోని వెంకటేశ్వర రైస్‌మిల్‌కు తరలిస్తే నాణ్యత పేరిట కొర్రీలు పెడుతున్నాడని డైరెక్టర్ చిమిరాల శేషాచార్యులు, నెలవేని బుచ్చయ్యతో పాటు రైతులు మిల్ యజమానిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ సంబంధిత డీటీసీఎస్ వేణు, రైస్‌మిల్ యజమానితో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం దిగుమతి చేసుకోవాలని సూచించారు.

డయేరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనా జవేరియా శుక్రవారం మండలంలోని మాచనపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో ఐడీసీఎఫ్(ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... అతిసార వల్ల చిన్నారుల్లో సంభవించే మరణాలు, నివారణ, నియంత్రణపై తల్లులకు అవగాహన కల్పించారు. తగిన జాగ్రత్తలు పాటించాలని, ఓఆర్ఎస్ ద్రావాలను పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తిక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సర్పంచ్ బొజ్జం కల్పనా తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ వేల్పుల శ్రీకాంత్, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, స్వరూప, అరుణ, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

ముందుకుసాగని పనులు

ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలకు మోక్షమెన్నడో..?

- ఒక్కో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు
- భూ సేకరణకే చాలా సమయం
- పూర్తికాని టెండరు ప్రక్రియ



మానకొండూర్‌లోని ఆరోగ్య ఉప కేంద్రం భవనం

మానకొండూర్: ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను మంజూరు చేసింది. అయినా భవన నిర్మాణ పనులకు ఇంకా మోక్షం కలగడం లేదు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఏడాది గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణాలకు భూ సేకరణకే చాలా రోజుల సమయం పట్టగా నేటికి పనులు టెండరు దశలోనే ఉన్నాయి.

ఒక్కో భవనానికి రూ.20 లక్షలు

గ్రామీణ ప్రాంతాల్లో పల్లె దవాఖానాల కోసం ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను చేపట్టాలని భావించింది.

- మానకొండూర్, వెల్ది ఆరోగ్య కేంద్రాల పరిధిలో 13 ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది.
- మానకొండూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో మానకొండూర్ 1, మానకొండూర్ 2, ఈదుల గట్టెపల్లి, చెంజర్ల, కొండపల్కల, గంగిపల్లి, గట్టుదు ద్దెనపల్లి గ్రామాలకు ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరయ్యాయి.
- అన్నారం మినహా ఎక్కడా కూడా పనులు మొదలు కాలేదు.
- భవన నిర్మాణాల కోసం అన్నారం మినహా మిగితా గ్రామాల్లో భూ సేకరణ ఎట్టకేలకు పూర్తి చేశారు. భవన నిర్మాణ పనులు మాత్రం టెండరు దశలోనే ఉన్నాయి.
- వెల్ది ఆరోగ్య కేంద్ర పరిధిలో వెల్ది, వేగురుపల్లి, పచ్చునూర్, దేవంపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు కాగా వెల్దిలో మాత్రం పనులు పూర్తయ్యాయి. మిగితా చోట్ల భూమిపూజకు పరిమితమయ్యాయి.
- దేవంపల్లిలో పనులు మొదలు కాలేదు. ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలకు భూ సేకరణలో జాప్యమో లేక ఇతరత్ర కారణాలో తెలియదు కానీ పనులు ముందుకుసాగడం లేదని వైద్య సిబ్బంది వాపోతున్నారు.
- ఉపకేంద్రాల భవనాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామీణ ప్రజలు ప్రభుత్వం, అధికారులను కోరుతున్నారు.

సమాచారం

■ **నేడు సర్వసభ్య సమావేశం**

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో విజయలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

■ **బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీలు**

సైదాపూర్: మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు గానూ 13 గ్రామాలకు ఒక సమన్వయ కమిటీని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల సమావేశంలో ఒక సమన్వయ కమిటీని నియమించారు. అధ్యక్షులుగా బిల్లా వెంకటరెడ్డి, చందా శ్రీనివాస్, సభ్యులుగా రాములు, ప్రవీణ్, సునీత, శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, సుదీర్, రాజేశ్వర్‌రెడ్డి, కొమురయ్య, పద్మజ, రవీందర్‌రెడ్డి, అనిత ఎన్నికయ్యారు. 31 వరకు గ్రామాల్లో పర్యటించి వివిధ కమిటీలు, సోషల్ మీడియాను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

■ **బీఆర్ఎస్ వార్డు కమిటీలు**

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 14, 24 వార్డుల బీఆర్ఎస్ కమిటీలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. 14 వార్డు అధ్యక్షుడిగా పంజాల అనిల్, ఉపాధ్యక్షుడిగా దొడ్డె శ్రీకాంత్, 24వ వార్డు అధ్యక్షుడిగా పరిమళ మాణిక్యం, ఉపాధ్యక్షుడుగా వరంగంటి సదానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిడ్డి రాము, బోగం వెంకటేశ్, దొడ్డె సదానందం, గజ్జెల క్రాంతి, జక్కే శ్రీను, ప్రేమ్, సమ్మయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

■ **గౌడ్రైలకాపరుల సంఘం అధ్యక్షుడిగా భీరయ్య**

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ గౌడ్రైలకాపరుల సంఘం అధ్యక్షుడిగా పుల్ల భీరయ్యను సంఘం సభ్యులు శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా నిట్టు కొంరయ్య, డైరెక్టర్లుగా భూమల్ల మల్లయ్య, నిట్టు భీరయ్య, ముత్త బాలమల్లు ఎన్నికయ్యారు.

■ **ఇంటి స్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ**

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీలో శనివారం నుంచి సోమవారం వరకు ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ చేయనుందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సైదాపూర్: ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలం, సొంతింటి నిర్మాణానికి శుక్రవారం గ్రామ పంచాయతీల ద్వారా అర్హుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చేత చాటింపు వేయించారు. ఈమేరకు ఇలు లేని నిరుపేదలు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు ఇచ్చారు.

■ **మాజీ సర్పంచ్ మృతి**

చొప్పదండి: మండలలోని మంగళపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పెద్దెల్లి బక్కమ్మ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. చిట్యాలపల్లి సర్పంచ్‌గా బక్కమ్మ 2001 నుంచి 2006 వరకు సేవలు అందించారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌ను కలిసిన జేపీఎస్‌లు



రామడుగు: మండలానికి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను శుక్రవారం బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. తమను రెగ్యులరైజ్ చేయడంతో సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. రెగ్యులరైజ్ చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నర్సరీలోని మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో ప్రియాంక

శంకరపట్నం: నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని జెడ్పీసీఈవో ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని అంబాల్‌పూర్ గ్రామం నర్సరీ, కంపోస్టుషెడ్డు, మురికికాలువలు, రహదారి వెంట మొక్కలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా పంచాయతీ ట్యాంకర్‌తో నీరు పోయాలన్నారు. గ్రామంలో చెత్త సేకరించి కంపోస్టు ఎరువు తయారు చేసుకోవాలని సూచించారు. జెడ్పీసీఈవో వెంట ఎంపీడీవో బషీరొద్దీన్, కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి

తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయపార్టీలు, మానకొండూర్ నియోజకవర్గంలోని తహసీల్దార్లతో జెడ్పీసీఈవో ప్రియాంక ఓటర్ జాబితాపై సమావేశం నిర్వహించారు. ఇంటింటి ఓటర్ సర్వే నిర్వహిస్తున్నామని, 1985 నుంచి 2019వరకు సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ వివరాలు, ఓటర్ జాబితాలో మృతుల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పులపై చర్చించారు. బూత్ లెవల్ అధికారులు చేస్తున్న ఇంటింటి సర్వే పారదర్శకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, లక్ష్మారెడ్డి, కనకయ్య, అనంతరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉత్సవాలను అన్నిశాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీపీ ముద్దసాని సులోచన ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తహసీల్దార్ లక్ష్మారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్‌లు అందజేత



ప్రజాప్రతినిధులకు ప్రొసీడింగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: మండలానికి మంజూరైన ప్యాడీ క్లీనర్‌ల ప్రొసీడింగ్‌లను హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ప్రజాప్రతినిధులకు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్‌లకు మంజూరైన 20 ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. మండలంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నందున రూ.12 లక్షల విలువ గల ప్యాడీ క్లీనర్లు, రూ.4.48 లక్షల విలువ గల 280 టార్పాలిన్లు అందించామని చెప్పారు. కార్యక్రమంలో చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజితతిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి చర్మ కార్మికుల వినతి

జమ్మికుంట: ఉపాధి కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి జమ్మికుంట చర్మ కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన కౌశిక్‌రెడ్డి లీడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్‌నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చర్మ కార్మికల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చర్మ కార్మికుల సంఘం అధ్యక్షుడు రామంచ రాజారామ్, ప్రధాన కార్యదర్శి మనీష్, చిట్యాల మొగిలి, ఇమ్మడి రాజు, కొండయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానపత్రం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని 29న ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ పడిదం ప్రభావతి, ఉపసర్పంచ్ బెల్లి రాజయ్య, ఎంపీటీసీ కాసం పద్మ హైదరాబాద్‌లోని టూరిజం కార్యాలయంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మండ సతీష్‌గౌడ్, రావుల భరత్‌రెడ్డి, ఇమ్మడి రమేష్, కట్కూరి నాగరాజు, రామచంద్రం తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రెడ్డి ఆత్మీయ సమ్మేళన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. రేకొండ, లంబాడిపల్లి, సీతారాంపూర్, చిగురుమామిడి, కొండాపూర్, సుందరగిరి, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, గ్రామాల్లో జూన్ 6న చలో కరీంనగర్ రెడ్డీల ఆత్మీయ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం నాయకులు మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అర్హులకు పెన్షన్ ఇవ్వాలని, విద్యార్థులకు హాస్టల్‌వసతి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, వి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, చిగురుమామిడి నాయకుడు కాటం సంపత్‌రెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

చిగురుమామిడి: మండలంలోని రేకొండ ఉపసర్పంచ్ చాడ మహిపాల్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. 11 మంది వార్డు సభ్యులు 2022 మే 11న అవిశ్వాస తీర్మానం డీపీవోకు అందించారు. కరీంనగర్ ఆర్డీవో ఆనంద్ కుమార్ శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదిమంది వార్డు సభ్యులు, సర్పంచ్ హాజరయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నిన్నటి వరకు పదవిలో కొనసాగిన ఉపసర్పంచ్ చాడ మహిపాల్‌రెడ్డి తన పదవిని కోల్పోయారని ఆర్డీఓ ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, ఎంపీవో శ్రావన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

చొప్పదండి: పట్టణంలోని 14వ వార్డులో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గడ్డి తొలగించడంతో పాటు, మట్టికుప్పలను చదను చేశారు. మున్సిపల్ కమిషనర్ పి. శాంతికుమార్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎన్. జ్యోతి, మేనేజర్ ప్రశాంత్ కుమార్, అంజయ్య, రవిందర్, శ్రీధర్ రెడ్డి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899